క్లుప్తంగా

ఘనంగా శ్రీరామాలయ ప్రతిష్ఠ



కల్యాణం చేస్తున్న అర్చకులు

బలిజిపేట: బర్లిలో శ్రీరామాలయ ప్రతిష్ఠ కార్యక్రమం మూడవ రోజు శనివారంతో ముగిసింది. యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాంగ దేవతామూర్తుల శ్రీసీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. చివరగా పండిత సత్కారం వేదాశీర్వాదంలతో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

చలపతిరావు సేవలు ప్రశంసనీయం



ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ కోడా చలపతిరావును సత్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: ఏపీ ట్రాన్స్‌కో పర్యవేక్షక ఇంజినీర్‌గా పని చేసిన కోడా చలపతిరావు సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం పదవి విరమణ చేసిన చలపతిరావును జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలపతిరావు అంకిత భావంతో విధుల నిర్వహించారన్నారు. శంబర పోలమాంబ, సాలూరు శ్యామలాంబ జాతర సమయంలో విద్యుత్ నిర్వహణలో ప్రశంసనీయమైన పాత్రను పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, ఏఎస్పీ అంకిత సురాన, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజన్నదొర జన్మదిన వేడుకలు

సాలూరు: ప్రజా నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర జన్మదిన వేడుకలు ఆదివారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద వేడుకగా నిర్వహించనున్నట్టు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరి రఘు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి



పింఛన్ సొమ్మును అందిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: పట్టణంలో 1, 4, 5 వార్డులలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాష్ట్ర మహిళా స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం పంపిణీ చేశారు. వార్డులలో పలువురు పింఛన్ లబ్ధిదారుల వద్దకు వెళ్లి మంత్రి పింఛన్ సొమ్ములను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

సాలూరు: ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 4 నుంచి తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు కళాశాల కన్వీనర్, సాలూరు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట రెండు పాస్ ఫొటోలు, 10వ తరగతి మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జెరాక్స్‌లతో సాలూరు ఐటీఐ కళాశాల నందు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9052508903 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

15 రోజులు సరుకులు పంపిణీ చేయాలి

సీతానగరం: మండలంలోని రేషన్ సరుకుల వాహనాలు రద్దు కావడంతో వినియోగదారులకు రేషన్ డీలర్లు అందుబాటులో ఉండాలని ఇంచార్జి తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఎస్‌డీటీ రమేష్‌బాబు అధ్యక్షతన శనివారం వీఆర్వోలు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నెలలో 15 రోజులు ప్రతి రోజూ 8గంటల నుంచి 12 గంటల వరకూ సాయంత్రం 4గంటల నుంచి 7 వరకూ డిపోల వద్ద సరుకులు పంపిణీ చేయాలని కోరారు. సీఎస్‌డీటీ రమేష్‌బాబు మాట్లాడుతూ మండలంలోని 17768 మందికి రేషన్ కార్డులున్నాయని వారందరికీ నిర్దేశించిన సమయంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కోరారు.

అన్నదాతకు మొండి చేయి



పూడికలతో పేరుకుపోయి అధ్వానంగా ఉన్న తోటపల్లి కాలువ

పార్వతీపురం రూరల్/సీతానగరం/ బలిజిపేట:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార చేపట్టిన తరువాత అన్నదాతకు అన్ని విధాల మొండి చేయి చూపింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాగు పెట్టుబడి సాయం నుంచి విత్తనం వరకు దిగుబడులు కొనుగోలు చేసే వరకు ఆర్‌బీకేల ద్వారా అన్నింటా తానై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచింది. కూటమి వచ్చాక ఆర్‌బీకేను ప్రణాళిక ప్రకారం నిర్వీర్యం చేసింది. ఏడాదైనా నేటి వరకు పెట్టుబడి సాయం అందించలేదు. అవసరమైన విత్తనాలను పంపిణీ చేయడం లేదు. పంటల బీమా విషయంలో కూడా నిర్లక్ష్యమే చూపింది. విత్తనం నుంచి ఎరువుల వరకు ఏ ఒక్కటీ అన్నదాతకు అందుబాటులో లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ సమీపించినా సాగునీటికి సంబంధించిన పనులు, భూసార పరీక్షలు, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు నేర్పాల్సిన మెలకువలు అన్నింటినీ గాలికొదిలేసింది. గతంలో చంద్రబాబు చెప్పినట్టు వ్యవసాయాన్ని దండగగా మార్చేసింది. దీంతో అన్నదాత ఊసూరుమంటున్నారు. గత ప్రభుత్వంలో అందిన ఏ ఒక్క సాయం కూటమి హయాంలో అందడం లేదు.

కూటమి ప్రభుత్వంలో దగాపడ్డ రైతులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం అవుతున్నా ఇంత వరకు రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదు. ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వకపోవడం, పంట బీమా కూడా రైతులకు కల్పించకపోవడం చాలా దారుణం. రుణాల నిమిత్తం బ్యాంకర్ల వద్దకు వెళితే పూర్తిగా రుణాలు, వడ్డీలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తుండడంతో రైతులు ప్రైవేటుగా అప్పులకు పరుగులు తీయాల్సి వస్తుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సదుపాయాలు కల్పించి వారి అండగా నిలిచింది.

– యమ్మల మన్మధరావు, సీపీఎం నాయకుడు, బలిజిపేట

కూటమిలో వ్యవసాయానికి ఆసరా ఏదీ..



కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఇంత వరకూ ఖరీఫ్ సీజను సమీపిస్తున్నా ఎటువంటి సహకారం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఖరీఫ్ సీజనుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామన్నా ఇంతవరకూ ఇవ్వలేదు. సీసీ ఆర్సీ కార్డులు ఇచ్చి బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇస్తామన్నారు. ఇంతవరకూ ఇవ్వలేదు. రుణాలు తీసుకున్న వారికి ఇంతవరకూ వడ్డీ రాయితీ ఇవ్వలేదు. అదనంగా అప్పులు పుట్టక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. జగనన్న ప్రభుత్వంలో రుణాలపై రాయితీ, రైతు భరోసా ఇచ్చి ఆదుకున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– రెడ్డి ఈశ్వరరావు, రైతు వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి, సీతానగరం

విస్మరించారు...



గత ప్రభుత్వంలో వర్షాకాలానికి ముందే రైతు భరోసా కేంద్రం నుంచి గ్రామ వ్యవసాయ శాఖ అధికారి నేతృత్వంలో విత్తనాల పంపిణీ, తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఎరువులు, రైతు భరోసా వంటి ఆసరాలను రైతులకు నేరుగా అందించే ప్రయత్నం చేయగా ఈ కూటమి ప్రభుత్వంలో వర్షాలు ప్రారంభమైన కనీస స్థాయిలో రైతుల వైపు చూసేవారే కరువయ్యారు. అకాల వర్షాల కారణంగా అపరాల పంటలు నష్టపోయిన వాటికి నష్ట పరిహారం చెల్లించడంగాని, అంచనా వేయడంగాని ప్రస్తుతం చేయడం లేదు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన ప్రధానమైన సాగునీటి వనరులకు సంబంధించిన మరమ్మతు పనుల వంటివి సైతం చేయడం లేదు.

– తాన్న శ్రీరాము, ఎమ్మార్‌నగరం, పార్వతీపురం మండలం

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ



బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

సాలూరు రూరల్: మండలంలోని జీగిరాం గ్రామంలో శనివారం స్ఫూర్తి మహిళా సంఘం డైరెక్టర్ బలగ రాధ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా ఆడపిల్లలను తల్లిదండ్రులు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. చిన్న వయసులో వివాహమై పిల్లలకు జన్మనిస్తే తల్లీబిడ్డలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి నాయకురాలు గంగా పైడితల్లి, పి.సత్యవతి, కమల, శ్రీదేవి, అప్పల నరసమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

బైండోవర్ కేసులతో భయాందోళన కలిగిస్తారా!



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

పార్వతీపురం: భూ సమస్యలు పరిష్కరించమంటే బైండోవర్ కేసులు పెట్టి భయాందోళనకు అధికారులు గురి చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. పార్వతీపురం సుందరయ్య భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం, పాచిపెంట మండలాల రెవెన్యూ అధికారులు భూ సమస్యలను పరిష్కరించడం చేతకాక నిర్బంధాన్ని ప్రయోగించడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లా వ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం కృషి చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్వతీపురం మండలంలోని బంటువాని వలస నిర్వాసితుల సమస్యపై ఆందోళన నిర్వహించిన పదిమంది నాయకులపై, పాచిపెంట మండలం కుడుమూరు భూ సమస్యపై ఆందోళన నిర్వహించిన సీపీఎం నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేశారన్నారు. ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులు వి.ఇందిర, బీవీ రమణ తదితరులున్నారు.

మంత్రిగారూ...మీ మాట ఏమైనట్టు!

- ఎంపీపీ బడ్నాన ప్రమీల



పాచిపెంట: రేషన్ వాహనాలు రద్దు చేయమని చెప్పి జిల్లా పరిషత్ సాక్షిగా హామీ ఇచ్చిన గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట నేడు ఏమైనట్లని పాచిపెంట ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత సంవత్సరం జూన్ 12వ తేదీన విజయనగరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రేషన్ వాహనాల రద్దుకు సంబంధించిన అంశం చర్చకు వచ్చినపుడు రేషన్ వాహనాలు రద్దు చేయబోమని మంత్రి సంధ్యారాణి మాట ఇచ్చారని నేడు దాన్ని మరిచారని ఆమె ధ్వజమెత్తారు. ఒక గిరిజన మంత్రిగా సంధ్యారాణి గిరిజనుల కష్టాలు తీర్చేలా వ్యవహరించకపోవడం శోచనీయమన్నారు.

గిరిజన సమస్యల గురించి కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని దుయ్యబట్టారు. తొలిత వలంటీర్లను తొలగించారని, తరువాత మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సేల్స్‌మాన్‌లను, సూపర్‌వైజర్లను, నేడు ఎండీయూ ఆపరేటర్లను తొలగించారన్నారు. ఇదేనా కూటమి ఉద్యోగ కల్పన అని ప్రశ్నించారు.

ప్రజలకు మంచి జరగాలి



స్వామి వారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట పంచాయతీ గుమ్మిడివరం గ్రామస్తులు నిర్మించుకున్న సీతారాముల వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు దర్శించుకుని ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని పూజలు చేసినట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. గుమ్మిడివరంలో నిర్మించుకున్న సీతారాముల ఆలయ నిర్వాహకులు పిలుపు మేరకు శనివారం ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రామాలయంలో జరిగిన స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో తనకు అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అక్కపోలు సింహాచలం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పండగ దృష్ట్యా వాహనాల దారి మళ్లింపు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ తల్లి గ్రామ దేవతల పండగలను పురస్కరించుకొని భక్తుల రద్దీ దృష్ట్యా జూన్ 3 మంగళవారం సిరిమానోత్సవం రోజున సాయంత్రం 5గంటల నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు భారీ వాహనాలను జిల్లా కేంద్రానికి ఇరువైపులా సరిహద్దు ప్రాంతాలైన నర్సిపురం, అర్తాం గ్రామాల సమీపంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై రాకపోకలు చేసే వాహనాలను నిలిపివేస్తున్నట్టు పట్టణ సీఐ కె.మురళీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను పార్వతీపురం బైపాస్ రోడ్డు మీదుగా పాలకొండ వెపు వెళ్లే వాహనాలను, అలాగే రాయగడ వైపు వెళ్లే వాహనాలను చంద్రంపేట, కొత్తవలస మీదుగా మళ్లించేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ఆయన తెలిపారు. సిరిమానోత్సవం సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి లోపలకు వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు బైపాస్ మార్గం ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు. అలాగే సిరిమాను తిరిగే వీధుల్లో ఇళ్లముందు వాహనాలను పార్కింగ్ చేయకూడదని సీఐ సూచించారు.

శిథిలావస్థకు చేరిన ఇటీవల నిర్మించిన కల్వర్టు



కుంగిన కల్వర్టు



గ్రామంలోని జలమయం అయిన రోడ్డును చూపిస్తున్న సీపీఎం నాయకులు రాము

పార్వతీపురం మండలంలోని కె.ములగ జంక్షన్ నుంచి దోకిశీల వరకు ఉన్న మార్గంలో ఆరు నెలల కిందట నిర్మించిన కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు శిథిలమైంది. నాణ్యత లేకపోవడం వల్లే ఇలా జరిగిందని సీపీఎం నేత పి.రాము పేర్కొన్నారు. గ్రామంలోని రోడ్డు చిన్నపాటి వర్షానికే ఇలా తయారై ఇబ్బందులకు గురి చేస్తోంది.

– పార్వతీపురం రూరల్

4న వెన్నుపోటు దినం



వెన్నుపోటు దినం పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోదాం
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతుందని అదే రోజు వెన్నుపోటు దినం పేరుతో జిల్లా కేంద్రంలో, నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడదామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. శనివారం తన స్వగృహంలో నియోజకవర్గ పరిధిలో గల జిల్లా పార్టీ ప్రతినిధులు, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి 'వెన్నుపోటు దినం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని దుర్మార్గమైన పాలన అందిస్తున్నారని ఆరోపించారు. దేశ చరిత్రలో ఇటువంటి పాలనను ఎప్పుడూ చూడలేదని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ, వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరిపిస్తామన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలనలో నిరంకుశ, అరాచక విధానాలను ప్రజలకు పరిచయం చేసిందని ఆయన విమర్శించారు.

బలిజిపేటలో..

బలిజిపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని దీన్ని మరింత బలోపేతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బలిజిపేట కార్యాలయంలో నాయకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రం పార్వతీపురంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలి ఉన్న ఉద్యోగులను తొలగించడం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుందని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంపై రూ.1.49 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని, ఆ సొమ్మును దేనికి వినియోగించారో తెలియడం లేదని అలజంగి అన్నారు. ఆనాడు మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, ఈ రోజు నేరుగా తనను నమ్మి ఓటు వేసిన ప్రజలనే వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఈ మోసాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్‌సీపీ 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలతో కలసి వెస్సార్‌సీపీ విగ్రహం కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి స్థానిక అధికారులకు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములు నాయుడు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మువ్వల సత్యంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, జెడ్పీటీసీ మామిడి బాబ్జి, వైఎస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాధం, బి.రవికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు దాసరి నాగరత్నం, రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శి నడిమింటి రామకృష్ణ, నియోకవర్గ స్థాయి 29 అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర స్థాయి 23 అనుబంధ విభాగాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ప్రజలకు ఆరోగ్యం

పార్వతీపురం టౌన్: యోగా ద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ప్రశాంతంగా జీవించగలరని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా పార్వతీపురం లయన్స్ క్లబ్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం శనివారం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, ఐఎంఏ అధ్యక్షులు యాళ్ల వివేక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.నాగభూషణం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో..

సాలూరు: యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమని, మనిషి జీవితంలో యోగాకు ప్రత్యేక స్థానముందని యోగా శిక్షకులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో వైటీసీ వద్ద యోగసనాలు వేశారు. ప్రత్యేక యోగాసనాలు వేసి వాటి ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో కలెక్టర్

పార్వతీపురంటౌన్ :



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. ఈ నెల జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే మే 31వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. కలెక్టర్ పార్వతీపురం పట్టణంలోని ఇందిరా కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీలో ప్రజల స్పందన అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 59.32 కోట్ల రూపాయలు పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆదివాసీ భవనానికి స్థలం కేటాయించాలి

పార్వతీపురం: జిల్లా కేంద్రంలో ఆదివాసీ భవనం నిర్మాణానికి భూమి కేటాయించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏజేఏసీ) జిల్లా చైర్మన్ కొండగొర్రి ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ అధికారులను కోరారు. శనివారం పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవకు వారు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించి ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేజైషన్ చట్టం (ఎల్‌టీఆర్) కింద వున్న 30 కేసులు ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు. గుమ్మలక్ష్మీపురం– గుణుపూర్ జంక్షన్ వద్ద భవనాలు అక్రమంగా నిర్మించినప్పటికీ ఆక్రమణదారులపై తహసీల్దార్ చర్యలు తీసుకోలేదన్నారు. గిరిజనులకు రక్షణగావున్న 1/70 చట్టం పటిష్టంగా అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఆయనతో పాటు ఊలక వాసుదేవరావు, ఆరిక చంద్రశేఖరరావు, రాధాకృష్ణ తదితరులున్నారు.